అంటరాని వాడయిన
అతను డాక్టరుగా
అందరి అభిమానం
ఎలా సంపాదించాడు?

యస్సార్ తురగా
కథ

# బతుకుతెరువు

“నేను కొత్తగా ఈ హాస్పిటల్‌కు పోస్టయిన డాక్టర్ని!” అన్నాను రోగుల మధ్య ఉన్న కాంపౌండర్‌తో, పరిచయం చేసుకుంటూ.

“రంగా అంటే మీరేనా?” అన్నాడు నిర్లక్ష్యంగా.

“అవును!” అన్నాను డాక్టర్ కోసం కేటాయించిన సీట్లో కూచుంటూ, అప్పుడే నా పేరు ఇతనికి ఎలా తెలిసిందా అని ఆశ్చర్యపోతూ. కాకిబట్టల్లో వున్న ఒక నడివయస్కుడొచ్చి నమస్కారం పెట్టి—

“నాపేరు రాముడు, ఇక్కడ అటెండర్ని బాబూ!” అన్నాడు వినయంగా చేతులు కట్టుకొని.

ఈ ఊర్లో నెట్టుకు రావాలంటే అతని అవసరం ఆసర కావల్సివుంటుందని పించింది.

“రాముడూ! ఇక్కడ భోజనానికి ఏదైనా హోటలుందా?”

“లేదు బాబు!”

“మరెట్టా?”

“సమితి ఆఫీసుల్లో పనిచేసే బాబులంతా కలిసి, ఒకవంట మనిషిని పెట్టుకొని వండించుకొని తింటున్నారు బాబు. మీరూ ఆళ్లతో కలిస్తే మంచి గుంటాదిబాబు!” అన్నాడు రాముడు తలగోక్కుంటూ.

సలహా నచ్చింది, అలాగే చేద్దామనుకున్నాను.

మా కాంపౌండర్ మాత్రం మూగనోము పట్టాడు. మాటలేదు, పలుకులేదు. రోజులు గడుస్తున్న కొద్ది



రోగులు హాస్పిటల్‌కు అసలు రావడంలేదు, ఎందుకని రోగులు రావడంలేదని విచారిస్తే— ఒక హరిజనుడు ముట్టుకొని పరీక్షించి ఇచ్చేమందుల కంటే చావడమే నయమట. పోనీ హరిజనులు గిరిజనులు అయినా రావచ్చుకదా అంటే— కాంపౌండర్ వాళ్ల మొహాలు చూసి మందులివ్వడట, ఇది ఇక్కడ పరిస్థితి. నా మిత్రులు ఇక్కడకు వ

ప్రేముందు చేసిన వ్యాఖ్యానాలు గుర్తుకొచ్చాయి.

"ఒరే రంగా! ఊబిలో నా సామిరంగా అని దిగుతున్నావురా!"

"అటు కులం బలంగానీ, ఇటు డబ్బు బలంగానీ లేని వాడివి నువ్వేం చలామణీ అవుతావురా పల్లెటూళ్లలో"

"పల్లెల వాతావరణమే వేరు!"

"అక్కడి రాజకీయాలకు నువ్వేం నిలబడుతావురా?"

"హైద్రాబాద్‌లో అంటే కలిపి కొట్టరా కావేటి రంగా అని కొట్టుకొచ్చావు!"

"అసలేవోట్లో వేలుపెట్టినా కొరకలేని వాడివి— నువ్వేం అక్కడ బతుకుతావురా!"

నన్ను ఎంతో నిరుత్సాహ పరిచారు కాని నాకు గత్యంతరమేముంది? నా దయనీయమైన స్థితి వాళ్లకేం తెలుసు?

ఈ వెంకటాపురం చాలా వెనుకబడిన ప్రాంతం. ఎటుచూసినా కొండలు గుట్టలు, రాళ్ల రప్పలు, చెట్లు చేమలు, ఇక్కడి జనాభాలో ఎక్కువమంది గిరిజనులు, హరిజనులు, బడుగువర్గాలే. ఇక్కడ ప్రజలు ఎక్కువ అడవులమీద ఆధారపడి బతుకుతారు. అందుకే ప్రభుత్వం, సమితి ఆఫీసు ఇక్కడపెట్టి అభివృద్ధికి ఉదారంగా గ్రాంట్లు ఇచ్చింది.

కాని ఇక్కడ కుల రాజకీయాలు ఇట్లా తగలబడ్డాయి. అందుకే ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు పెట్టుకొని వాళ్లకు ఆరోగ్య సూత్రాలు ప్రథమచికిత్సలు, పారిశుధ్యం గురించి వివరించి వాళ్లతో కలిసిమెలిసి బతకాలనుకున్నాను.

ఒక ఆదివారం రాముడ్ని వెంట పెట్టుకొని ఊళ్లో కెళ్లాను. నన్ను నా స్టెతస్కోపు చూసి నన్నుల్ని గుర్తించి, కావాలనే మొహాలు తప్పించారు. కొంతమంది నిర్ల క్ష్యంగా నిర్లిప్తంగా సమాధానాలిచ్చారు. నేను నిరుత్సాహపడలేదు. నా పనినేను పట్టుదలతో చేయాలనుకొని ఇంకొక రోజెళ్లాను. ఆరోజు జనం పారిపోతున్నట్లు వడివడిగా వెళ్తున్నారు. పక్కకు తప్పుకుంటున్నారు. మొదట్లో నన్నుల్ని చూసి వెళ్తున్నారనుకున్నాను.

కానీ లేదు. ఆరడుగుల ఎత్తు, ఎత్తుకుతగ్గ లావు, తెల్లటి శరీరఛాయ, ఖద్దరులాల్చీ, పంచ, కండువా, నోట్లో పెద్దచుట్ట కళ్లకు అద్దాలు ధరించిన వ్యక్తిని చూసి భయం భయంగా వెళ్తున్నారు.

"రాముడూ! ఎవరీయన?" అడిగాను హిందీ సినిమాల్లో కనిపించే చంబల్‌లోయలోని ఢాకూలాగుంటేను.

"ఈయనపేరు వరహాలరావు— ఈ వూర్లో కంతా పెద్ద మోతుబరి ఈ వూరు జమీందారు బాబు. అందుకే అందరూ అట్టాపోతున్నారు!" అన్నాడు రాముడు నా వెనకాల కనబడకుండా నిలబడి.

ఇంకా ఈలాంటి పెత్తందార్లు జమీందార్లు పెద్దరికాలు ఉన్నాయంటే నాకు ఆశ్చర్యమేసింది. నా చిన్నతనంలో వూర్లో జరిగిన ఒక సంఘటన నాకు ఇంకా గుర్తుంది.

నేను తొమ్మిదవ తరగతి చదువుతున్నాను. సెలవుల్లో మా వూరెళ్లొచ్చాను. ఇంటిదగ్గర మానాన్న లేదు.

"అమ్మా! నాన్న ఎక్కడ?" ఆత్రుతగా అడిగాను ఇంటికి వెళ్లగానే.

"పెద్ద కాపుగారింట్లో పని చేస్తున్నాడు బాబు!" అంది మా అమ్మ.

"నేను పోతున్నాను అమ్మా!" అంటూ పరుగెత్తాను మా అమ్మ వద్దని వారించినా వినకుండా.

మానాన్న పెద్ద కాపుగారి గొడ్ల పాక శుభ్రం చేస్తున్నాడు— పేడతీసి ఒకచోట పోగు చేస్తున్నాడు.

"నాన్నా!" అంటూ పెద్దగా అమాయకంగా ఆప్యాయంగా అరిచాను.

"రంగా! ఎప్పుడొచ్చావురా?" అన్నాడు మా నాన్న చేతిలోని తట్ట అక్కడ పారేసి ఆనందంగా.

మానాన్నను వెళ్లి తనివితీరా కౌగలించు కోవాలనుకున్నాను— కానీ అడ్డుగోడ నిలిచింది. మా నాన్న నేను ఒక్కక్షణం తనివి తీరా చూసుకున్నాం.

"ఎవడురా వీడు?" అన్నాడు— అరిచాడు పెద్దకాపు మెరుపులా వచ్చి— మా నాన్నను ఉద్దేశించి.

"నా కొడుకు సామి!" అన్నాడు మా నాన్న తడబడుతూ. వన్నొకసారి ఆ పాదమస్తకం పరిశీలనగా చూసాడు పెద్దకాపు.

"అలా గాడిదలా మంచోకపోతే కాస్తమీ అయ్యకు సాయం చేయ్యకూడదరా?" అని గద్దించాడు, గాండ్రించాడు పెద్దకాపు.

అది మానాన్నమీదున్న సానుభూతో లేక ఒక హరిజనబాలుడు తెల్లబట్టలేసుకున్నాడన్న అసూయో నా కర్థం కాలేదు.

"వాడి మొహం వాడేం చేస్తాడు సామి, ఏదో సదువుకుంటుండుగదా" అన్నాడు నాన్న నత్తినత్తిగా నీళ్లు నములుతూ.

"చదివి కలక్టర్ అవుతాడా డాక్టర్ అవుతాడా? ఊఁఊఁ కాస్త సాయంపట్టు!" అంటూ ఆగ్రహంగా అరిచి వెళ్లిపోయాడు.

నాకు కళ్లలో నీళ్లు తిరిగాయి. మా నాన్న



నిస్సహాయంగా జాలిగా నా కేసి చూస్తున్నాడు. పెద్దకాపు మాటలు నా మీద బాగా పనిచేసాయి.

ఏం నేను మాత్రం కష్టపడి చదివి కలెక్టరో డాక్టరో ఎందుకు కాకూడదు?'' అనే ఆలోచన నా బుర్రలో మెరిసి, పట్టు దల, పంతం పెరిగింది. మన సమాజంలో పెద్ద కాపులాంటి వాళ్లకు వరహరిరావు లాంటి నిరంకుశవాదులకు కొదవలేదు. నేను మాత్రం పట్టువిడవని విక్రమార్కునిలాగా అవకాశం దొరికి నప్పుడల్లా— ఒక్కొక్కవీధికి వెళ్లి నా కార్యక్రమాన్ని చేపట్టుతూనే ఉన్నాను. అక్కడి ప్రజలెవ్వ రూ శ్రద్ధ చూపడంలేదు. వీడా మాకు బోధలు చేసేది అన్నట్టుంది వాళ్ల ధోరణి.

కానీ హరిజన గిరిజనవాడల్లోని ప్రజలు మాత్రం ఆసక్తిగా వింటూ శ్రద్ధగా సలహాలు సహాయాలు తీసుకుంటూ— నా పథకాలకు కొత్త ఊపిరిపోశారు. నేను ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ అవకాశం దొరికినప్పుడల్లా సేవలు చేస్తున్నాను. ఇంతలో ప్రభుత్వం దగ్గర నుండి పిడుగులాంటి వార్నింగ్ వచ్చింది— నేను హరిజనుడ్ని కాబట్టి హరిజనులకే సేవ చేస్తున్నానని, మిగతా బీద బిక్కి బడుగువ ర్గాల్ని అలక్ష్యం చేస్తున్నానని.

నా సంజాయిషీ ఇచ్చాను. కాని ఇక్కడకు ఏ డాక్టరైనా రావడానికి సిద్ధంగా ఉంటే, నన్ను ప్రభుత్వం కదిలించేదే— కానీ ఇక్కడకు ఎవ్వరూరారు కాబట్టి బతికిపోయాను. తర్వాత నాకు తెలిసిందేమిటంటే ఈ పిటిషన్ వ్య వహారమంతా మా కాంపౌండర్ నాయకత్వంలో జరిగిందని .

మా కాంపౌండర్‌కు నేను చేసిన అన్యాయం అపకారం ఏమిటో నా కర్థమయ్యేది కాదు. నన్ను చూస్తేనే మొహం మాడ్చుకొని పక్కకు తిరిగేవాడు.

ఈ ఊరికొచ్చిన దగ్గర నుండి నా కులం, నా ఆర్థిక దుస్థితి అడుగడుగునా అద్దంలో కనిపిస్తున్నాయి. అయినంతమాత్రాన ఒక డాక్టర్ వెళ్లి కాంపౌండర్‌కు నమస్కారాలుపెట్టే అడుగులకు మడుగులొత్తె స్థితికి దిగజారి నా వృత్తిని దిగజార్చలేను కదా.

నా మొదటి జీతం చేతికొచ్చింది. మా ఊరెళ్లి మా అమ్మా నాన్నను మా రామ్మూర్తి మేష్టార్ని మా వూరి లీడర్ రాజబాబుగార్ని చూడాలనే వాంఛకు లోబడి వెళ్లాను. వాళ్లనంతా పరామర్శించాలని నా మనసు తహతహలాడింది. మా అమ్మా నాన్న చూడగానే ఉత్సాహం ఉద్వేగం కలిగాయి.

''బాబూ!'' అంటూ మా నాన్న నన్ను హృదయానికి హత్తుకున్నాడు. మా అమ్మకు ఆనందం హృదయంలోంచి పొంగి ఆనంద బాష్పాలుగా రాల్చింది.

''ఓరే రంగా! నువ్వు తిండిగ్రటా ఎట్లా చేస్తున్నావురా?'' అడిగింది అమ్మ నాతలమీద చేయివేసి.

''నాకేమ్మా! కానీ మీరెలావున్నారు?'' అన్నాను ఆర్ద్రమైన హృదయంతో

''మాకేం బాబు! ఇహ బతికినన్నాళ్లు ఎలాను బతకం. మాకు కావల్సింది నీ

బాగు'' అంది అమ్మ కళ్ళొత్తుకుంటూ, నాన్న తృప్తిగా నన్ను చూస్తూ నుంచున్నాడు. కండలు కరిగిపోగా మిగిలిన ఎముకల గూళ్ళ నీరసించి నిస్సత్తువగా ఎక్కడో బావిలోంచి వచ్చే మాటల్లాగా స్ఫురించే వారి గొంతుకలు జీవకళ వెలికినా కనిపించని వారి మొహాలు చూసి నా హృదయం కరిగిపోయింది. తరుక్కుపోయింది.

సాయంత్రం మా రామ్మూర్తి మేస్టారింటికి వెళ్లాను. ఆయన అనారోగ్యంతో మంచంపట్టి వున్నారు. నన్ను చూడగానే ఎక్కడలేని శక్తి ఉత్సాహం ఆయనలో తొణికిసలాడాయి.

'''రంగా! ఎప్పుడొచ్చావ్?'' మంచంమీద నుంచి లేచి అమాంతంగా కౌగలించుకున్నాడు మాస్టారు.

''ఈరోజే మాస్టారూ!'' అన్నాను మాస్టారు పంచుతున్న ప్రేమానుభూతుల్ని చవిచూస్తూ ఆయన హృదయంలో ఇమిడిపోతూ.

మాస్టారు పెద్దమ్మాయి శకుంతల తలుపువెనకాల నిలబడి నన్ను ఆసక్తిగా చూస్తూ నుంచుంది. ఈమె నా క్లాసుమేటు బాల వితంతువు. స్కూలు టీచరుగా పనిచేస్తుంది. ఆమె హృదయం అమృతం, ఆమె అందం అమోఘం. ఆమె విజ్ఞానం అపారం. కానీ మాస్టరు కులంలో ఒక బాలవితంతువు మళ్లీ పెళ్లి చేసుకుని తనీదు మిగతా యువతుల్లా— సంసార సుఖాన్ని సారాన్ని అనుభూతుల్ని పంచుకొనే అవకాశమే లేదట.

''అమ్మా శకుంతలా! రంగాకు కాఫీ కలిపీయమ్మా!'' అన్నాడు మాస్టారు. కాసేపు మాస్టారుతో కబుర్లు పరామర్శలు.

''శకుంతలా బావున్నావా?'' అడిగాను కాఫీ అందుకుంటూ.

''అవును!'' అన్నట్టు సిగ్గుతో తలొంచుకొని తలాడించింది.

మాస్టారు దగ్గర సెలవు తీసుకొని లీడరు రాజబాబుగారింటికి వెళ్లాను.

''నమస్కారం సార్!'' హృదయపూర్వకంగా ఉప్పొంగిపోతున్న ఉత్సాహంతో అన్నాను.

''నువ్వా రంగా! రా!రా!'' అంటూ ఆప్యాయంగా ఆహ్వానించారు రాజబాబుగారు. వృద్ధాప్యంవల్ల కలిగిన అలసట, ఆయాసంతో

రాజబాబుగారు ఒకప్పుడు బాగా

## భాష




ఓ అమ్మాయికి జపాన్ భాషంటే మహా యిష్టం. కానీ పాపం ఆ భాష తెలీదు. జపాన్ భాష అక్షరాలతోను తన టీషర్ట్‌పై ఎంబ్రాయిడరీ చేయించింది. ఆ షర్ట్, జీన్ పాంట్లతో వెళ్తున్న ఆ అమ్మాయిని చూసి పగలబడి నవ్వాడు ఓ జపానీయుడు.

తన షర్ట్‌పై ఆ అమ్మాయి ఎంబ్రాయిడరీ చేయించిన జపాన్ అక్షరాలకి అర్థం. 'ఇక్కడ పాలు దొరుకును' అని.

—కేశినేని గిరిధర్ (తెనాలి)

వున్నవారు. ప్రజాసేవలో, రాజకీయాల్లో తిరిగి అందరూ సంపాదించుకుంటుంటే— ఈయన ఉన్నది పోగొట్టుకున్నారు.

"ఏమండీ రంగా గారూ! బావున్నారా?" అంటూ ముసిముసిగా నవ్వుతూ మంచినీళ్లు తీసుకొచ్చింది రాజబాబుగారి ఒక్కగానొక్క కూతురు శశిరేఖ. నాతో చాలా ఫ్రీగా మాట్లాడడం ఆమెకు అలవాటు.

"బావున్నానండీ— మీరో?" అన్నాను కుర్చీలో కూచుంటూ.

"క్షేమంగా— నిక్షేపంగా ఉన్నాం?" అంటూ కిలకిలా నవ్వింది శశిరేఖ.

"చాలా రోజులు తర్వాత— ఉద్యోగిగా ఒక గజిటెడ్ ఆఫీసర్‌గా పెద్ద డాక్టర్‌గా మన ఇంటికొస్తే— స్వీటు గీటులేదా?" అన్నారు రాజబాబుగారు నవ్వుతూ. రాజబాబుగారిని మా వూర్లో అందరూ లీడరనే పిలుస్తారు.

ఇంట్లోకి గెంతింది లేడిపిల్లలా శశిరేఖ.

నిజంగా శశిరేఖ ఆ ఇంటికి కాంతిరేఖ. బి.ఎ వరకు చదువుకుంది గుణం రూపం పుట్టుకతో తెచ్చుకొన్న అలంకారాలు. ఆమెలో ఇన్ని ప్లస్ పాయింట్స్ ఉన్నా— కట్నం బాధ తప్పలేదు. రాజబాబుగారి కులంలో లక్షలులక్షలు కట్నాలు ఇవ్వందే— ఆడపిల్లకు పెళ్లికాదట. అందుకే పాపం శశిరేఖ, తండ్రికి గుండెమీద కుంపటిలా ఉండిపోయింది.

మా వూర్లో రెండురోజులు ఆత్మీయుల మధ్య ఆనందంగా గడిపాను. మా అమ్మానాన్నకు ఒక నెలకు సరిపడే బియ్యం మిగతా సామాన్లు తీసి ఇచ్చాను. నాతోపాటు తీసుకొని వెంకటాపురం పోదామంటే నాకే ఇల్లులేదు. రామ్మూర్తి మాస్టారు గారితో రాజబాబుగారితో సెలవుతీసుకొని తిరుగుప్రయాణం కట్టాను.

రామ్మూర్తి మాస్టారు నాలోని తెలివితేటల్ని జిజ్ఞాసలను గుర్తించి విద్యాపరంగా ఆయనిచ్చిన ప్రోత్సాహం ప్రోద్బలం, రాజబాబుగారు ఇచ్చిన ఆర్థికపరమైన సపోర్టు సహకారం నన్నొక డాక్టర్ని చేసాయి. వాళ్ల ఋణం ఈ జీవితంలో ఎలా తీర్చుకోవాలో ఆలోచిస్తూ హాస్పటల్ చేరాను.

పగలంతా ప్రయాణం చేయడంవల్ల రాత్రి పదిగంటలకే మంచి నిద్రపట్టింది. రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో తలుపుకొట్టిన చప్పుడైతే వెళ్లి తలుపు తీసాను. రాముడితోపాటు ఇంకెవరో వున్నారు.

బాబుగోరు! పెద్దమ్మగారికి బాగోలేదట. నరహరిరావు పెద్దయ్యగారు ఊర్లో లేరట! మిమ్మల్ని వెంటనే తీస్కొరమ్మని వీళ్లని పంపినారట!" అంటూ కలవరపడి పోతున్నాడు రాముడు.

నాకు ఒక వైపు ఆశ్చర్యం మరోవైపు ఆందోళన కలిగాయి. నేను ఉద్యోగంలో ఈ ఊర్లో చేరాక నా మొదటి కేసు ఒకవిధంగా ఇదే.

"పదే వడవండీ!" అన్నాను గబగబా రెడి అయి స్టెతస్కోపు మెడకు తగిలించుకొని— మెడిసిన్ చెస్టు రాముడికిస్తూ.

ఇంద్ర భవనంలాంటి మేడలోకి దారితీసారు.

''నమస్కారం డాక్టర్ గారూ!'' అంది కంపిస్తున్న కంఠంతో

తలెత్తి చూసాను— నా మతిపోయింది. ఇది కలా నిజమా? ఈ ఇంద్ర భవనంలో ఎవరీ అప్సరస! 'నమస్కారం!' అన్నాను తముదుకున్నట్టు.

''మా అమ్మ బి.పి పేషంటు, సడన్‌గా బి.పి పెరిగి స్పృహ కోల్పోయింది...!'' అంది అప్సరస ఆందోళనగా ఆత్రుతగా.

గబగబా బి.పి పల్సు అవి చెక్‌చేసి—

''కంగారు పడాల్సిన అవసరంలేదు. ఆమెకు పూర్తిగా విశ్రాంతి అవసరం!'' అవి చెప్పి ఇంజక్షనిచ్చి— మాత్రలు మందు ఇచ్చాను.

''రాత్రికి నా అవసరం చాలామటుకు ఉండదు— ఉంటే మాత్రం కబురు చేయండి!'' చెప్పి మందులు మాత్రలు ఎలా వాడాలో వివరించాను.

''ఉదయం తప్పకుండా రండి డాక్టర్‌గారు!'' అంది వేడుకోలుగా.

''షూర్!'' అన్నాను ఆమె అందానికి ముగ్దుడినై.

ఆమె నన్ను గేటువరకు సాగనంపింది. నరహరిరావు రాజకీయ కార్యకలాపాలమీద ఊర్లు తిరుగుతున్నాడట. బహుశా ఆయన ఈ ఊర్లో వుంటే నన్ను గడపకూడా తొక్కనిచ్చేవాడు కాదేమో.

ఉదాయన్నే రాముడ్ని వెంటపెట్టుకొని వెళ్లాను. వాళ్లు మాకోసం ఎదురుచూస్తున్నారు.

''గుడ్‌మార్నింగ్ డాక్టర్!'' అంది ముద్దులొలికే పలుకులతో ముసిముసిగా నవ్వుతూ.

''గుడ్‌మార్నింగ్! అమ్మ కెలా ఉంది?''

''షి ఈజ్ బెటర్ నౌ!''

''గుడ్!'' మళ్లీ పరీక్షించి మందు మాత్రలిచ్చాను.

''డాక్టర్ గారూ! కాఫీ తీసుకుంటారా కూల్ డ్రింక్ తీసుకుంటారా?''

''నో థ్యాంక్స్!''

## అత్యధిక ఉష్ణోగత



సూర్యుడి మధ్యలో ఉష్ణోగత 20 మిలియన్ సెంటీగ్రేడ్ డిగ్రీలు ఉంటుంది. వేసవికాలం 45 డిగ్రీలకే ఆపసోపాలుపడే మనకు ఈ ఉష్ణోగత చాలా చాలా ఎక్కువగానే కన్పిస్తుంది. అయితే మ్యాకెర్సీకు చెందిన టోకోమాక్ ఫ్యూసన్ టెస్ట్ రియాక్టర్‌ను ఉపయోగించి శాస్త్రవేత్తలు సూర్యుడి ఉష్ణోగతకు పదిరెట్లు అంటే 200 మిలియన్ సెంటీగ్రేడ్ డిగ్రీల ఉష్ణోగతను ప్రయోగశాలలో పొందగల్గారు.

ఇంత అత్యధిక ఉష్ణోగతను సాధించిన ఘనత అప్లాస్మా ఫిజిక్స్ లేబొరేటరీకు దక్కుతుంది. మరి దీనిని ఉష్ణోగత రికార్డు అందామా?

—జూపిటర్

''ప్లీజ్!''

''కాఫీ'' అన్నాను ఆమెను కాదనలేక.

వీళ్ళ పేరుకు పల్లెటూర్లో ఉన్నా—పట్టణాలలో ఉండే సదుపాయాలకంటే ఎక్కువే వీళ్ల ఇంట్లో ఉన్నాయి. ఆర్థిక బలమే అన్నిటికి మూలం.

''ప్లీజ్!'' అంది బిస్కట్స్ కాఫీ ఉన్న ట్రే నా ముందుంచుతూ. కాఫీ సిప్‌చేసాను. ఆమెలాగే బ్రహ్మాండంగా ఉన్నాయి.

పెద్దమ్మగారి ఆరోగ్యం కుదుటపడే వరకు రోజూ వాళ్ల ఇంటికి వెళ్లాను. కొత్త డాక్టర్ పెద్దమ్మగారి ఆరోగ్యం బాగుచేసాడు అనే విషయం ఊరంతా దావానలంలాగా వ్యాపించింది. అప్పటినుండి మా ఆస్పత్రికి రోగులసంఖ్య ఒక్కసారిగా పెరిగింది. నాకు క్షణం తీరికలేక పోయింది. మా కాంపౌండర్ తలవంచేసాడు.

ఒక సాయంత్రం, ఏదో ఇంగ్లీషు నవల చదువుకుంటూ నా రూంలో కూర్చున్నాను.

''అమ్మాయి గోరొచ్చారు బాబు!'' అన్నాడు రాముదు హడావిడిగా వచ్చి.

''నమస్కారం డాక్టర్ గారు!'' అంది నరహరిరావు కూతురు మృదు మధురంగా.

''రండి రండి!'' అన్నాను తొట్రుపాటుతో.

ఆమె లోపలికి అడుగుపెట్టగానే గుప్పుమని గుబాళించింది గులాబీల వాసన.

''ఈ మధ్య నా ఆరోగ్యం బాగోలేదండీ!'' అంది నా ముందున్న కుర్చీలో కూచుంటూ.

''మీకేమైంది?'' అడిగాను కంగారుగా.

''అదే అర్థం కావడంలేదండీ!''

స్టెతస్కోపు తీసుకొని పెట్టు చేయబోయాను.

''వాడి చూసి మందివ్వండి చాలు!'' అంటూ చేయి నాకందించింది.

ఝల్లుమని షాక్ తగిలినట్టయింది. కవులు వర్ణించే పూబోణి అంటే ఈలాంటి శరీరమేమో ననిపించింది. పరవశంతో ఆమె అందాన్ని ఆస్వాదిస్తున్నాను.

''డాక్టర్‌గారు మీరెక్కడ పరీక్షిస్తున్నారు?'' అడిగింది మొహంలో మొహంపెట్టి

''ఆ.... ఆ...ఆ పల్స్!'' అన్నాను తడబడుతూ.

''ఏమిటి జబ్బు?''

''అన్నీ క్వయిట్ నార్మల్‌గా ఉన్నాయి! అయినా ఈ మాత్రలు వాడండి!'' అన్నాను కొన్ని మల్టీ విటమిన్ ట్యాబ్‌లెట్స్ ఇచ్చి.

''మీకు ఇంగ్లీష్ నావల్స్ అంటే ఇష్టమా?'' అడిగింది నా ఇంగ్లీషు నవల చూసి.

''అన్నీ ఇష్టంగా చదువుతాను! మరిచాను మీపేరు?''

''రాధా!''

''ఏం చదువుకున్నారు?''

''ఇంగ్లీషు లిటరేచర్‌తో బి.ఎ పాసైయ్యాను!''

''గుడ్!''

''మీ దగ్గరున్న నావల్స్ నాకివ్వండి, నా దగ్గరున్నవి మీకిస్తాను!''

''తప్పకుండా!''

వెంటనే నా దగ్గరున్న హెరాల్డ్ రాబిన్స్

క్షన్ హెరిటర్స్ నవల్ని తీసుకుంది.

"గుడ్‌నైట్ డాక్టర్ గారూ!" చెప్పి బాణంలాగా దూసుకొని పోయింది. అసలు నాకంతా అయోమయంగా ఉంది. అసలు ఈ వేళప్పుడు ఈమె ఎందుకొచ్చినట్టు? నిజంగా ఆరోగ్యం బాగాలేదా?

అప్పటినుండి రోజూ పుస్తకాలకోసమో! మందులకోసమో వచ్చి కాసేపు కబుర్లుచెప్పి కాలక్షేపం చేసి వెళ్లేది. నాకు ఈ మధ్య శకుంతల, శశిరేఖ వూరికే గుర్తొస్తున్నారు. రాధా కూడా ఆ కోవకు చెందినదే. నరహరిరావుకు తెలిస్తే మండిపడి నా ఉద్యోగం తీయిస్తాడు. నేను ఎంతకష్టపడి మాస్టర్ ఆఫ్ మెడిసన్ పరీక్షలు మెరిట్‌లో పాసయ్యాను. ఒక హరిజనుడు, ఒక కుగ్రామానికి చెందిన ఒక రైతుకూలి కొడుకు డాక్టర్ కావడం సాధ్యమేనా? ఎంతమంది మిత్రులు శ్రేయోభిలాషులు, ప్రభుత్వం సహాయపడితే డాక్టరయ్యాను?

యం.డి పట్టా చేతికొచ్చిందన్న సంతోషంగా ఉన్నా నా ఉదర పోషణ విషయానికొచ్చే సరికి వణుకు పుట్టేది. నాకిప్పుడు హాస్టల్‌లో తిండిపెట్టరు. స్నేహితులు శ్రేయోభిలాషులంతా తలోకదారి పోయారు. పోనీ మా ఊరికి పోదామా అంటే మా తల్లిదండ్రులకే తిండిలేదు నాకెవ్వరు పెట్టగలరు? కాబట్టి ఎలాగైనా నా కాళ్లమీద నేను నిలబడాలనే ఉద్దేశ్యంతోనే ఈ అడవి ప్రాంతమైన వెంకటాపురం వచ్చాను. ఇక్కడకు ఏ డాక్టర్ రాకపోయినా నాకు గత్యంతరం లేక నా పొట్టకూటికోసం వచ్చాను. ప్రస్తుత పరిస్థితులలో ఈ ఆధారం కూడా పోయేటట్టుంది.

రాధ ప్రేమని నిరాకరిస్తే ఆమె ఊరుకొనే రకంకాదు. ప్రేమాయణం సాగిస్తే ఆమె తండ్రి జమిందార్ నరహరిరావు నా అంతం చూస్తాడు. ఇక్కడనుండి ఉద్యోగం ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నిద్దామంటే జరిగేపనికాదు. పోనీ



ఉద్యోగమే మానుకుందామంటే నాకు నా తల్లిదండ్రులకు వేరే బ్రతుకుతెరువు లేదు.

రాధతో ఈ విషయం, నా స్థితిగతుల గురించి నా కులం గురించి చాలా విపులంగా ఉన్నదున్నట్టు చర్చించాను. నా గోడు చెప్పుకున్నాను.

"మీరింత పిరికివారనుకోలేదు డాక్టర్! నిజమైన ప్రేమకు, మీరు చెప్పే కారణాలన్నీ అడ్డుగోడలై నిలుస్తాయనే నేననుకోను కానీ మనల్ని మన ప్రేమను పరీక్షిస్తాయి అంతే! పరీక్షలకు భయమెందుకు?" అంది. నన్ను ఒడిలోకి తీసుకొని నా తల నిమురుతూ ఆర్ద్రమైన స్వరంతో.

రోజురోజుకు మా పరిచయం ప్రణయం కొత్త కొత్త రూపాల్ని రుచుల్ని సంతరించుకొని కొత్త పుంతల్ని తొక్కింది. మా ప్రేమకు పర్యవసానం ఎలా ఉన్నా సంతోషంగా స్వీకరించడానికి మానసికంగా శారీరకంగా సిద్ధపడ్డాను. నాకు కావల్సింది రాధ, ఆమె అందించే ప్రేమామృతం అందుకు మూల్యంగా నా ప్రాణాన్నయినా ఇవ్వడానికి సిద్ధం.

తెగించిన వాళ్లకు అడ్డేముంది. నేను రాధ విచ్చల విడిగా కొండగుట్టలు తిరగసాగాం. ఈ విషయం ఊరంతా తెలిసిపోయింది. మా కథ ముగింపు ఎలా ఉంటుందా అని అందరూ ఆత్రుతతో ఎదురుచూడసాగారు.

మా విషయం జమిందారుగారికి తెలిసి నన్ను ఇంటికి రమ్మని ఒకసాయంత్రంవేళ కబురు పెట్టారు. భయంతో నా గొంతులోని తడి ఆరిపోయింది. గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఉరికంబం ఎక్కబోయే వాడిలా ఉంది నా పరిస్థితి. కొంతసేపు అసలు పోదామా వద్దా అనే మీమాంసలో పడ్డాను. చివరకు రాధకోసం పోవాలనే నిశ్చయించుకున్నాను.

మా తల్లితండ్రులు, రామ్మూర్తి మాస్టారు, శకుంతల, రాజబాబు, శశిరేఖ గుర్తుకొచ్చి నా కళ్లు చెమ్మగిల్లాయి. గబగబా మూడు ఉత్తరాలు రాశాను.

"రాముడు! నేనొక పనిమీద వెళ్తున్నాను. ఉదయంవరకు రాకపోతే, సాయంత్రం ఈ మూడు ఉత్తరాలు ఎవ్వరికి తెలియకుండా పోస్టుచెయ్యి— ఈ విషయం మూడో కంటికి తెలియకూడదు" అన్నాను.

మా నాన్న, రామూర్తి మేస్టారు, రాజబాబు అడ్రసులు మరొకసారి చెక్‌చేసి రాముడు ఈ పని తప్పకుండా చేస్తాడనే నమ్మకం నాకుంది. ఒకవేళ నేను చంపబడితే ఈ ఉత్తరాలు మావాళ్లకు ఆ విషయాన్ని ఆమూలాగ్రంగా తెలియజేస్తాయి.

ఇంద్రభవనంలా ఉండే నరహరిరావుగారిల్లు నాకళ్లకు ఆరోజు తీహార్‌జైల్‌గా గోచరించింది. ఆరోజు లైట్లు కూడా మిణుకుమిణుకు మంటూ వెలుగుతున్నాయి. కళాకాంతులు కరువయ్యాయి. మెల్లగా అడుగులో అడుగువేసుకుంటూ వెళ్లి వరండాలో కూచున్నాను. ఇంట్లో నరహరిరావు ఆయన భార్య వాదులాడుకుంటున్నారు.

"అమ్మాయిలాగా, మీరెందుకు తొందరపడుతున్నారు— పైగా అతను మన కులంకాదు. మన ఆస్తి అంతస్తుకు తగినవాడుకాడు!" అంది రాధ తల్లి. వెకిలిగా వికారంగా నవ్వాడు నరహరిరావు.

"మన ఆస్తి, అంతస్తు, అధికారం నిలబడాలంటే— కాలాన్నిబట్టి నడుచుకొని మన పబ్బం గడుపుకోవాలి. రాధ, డాక్టర్ని మనసారా ప్రేమించింది. ఈడుజోడు చక్కగా కుదిరింది. కుల వ్యవస్థలో అతను తక్కువకావచ్చు. అతనొక పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన డాక్టర్, అతని విద్యా ఆధిక్యతను ఎవరూ కాదనలేరు. అదే మనకులంలోనైతే లక్షలుపోసి కొనుక్కోవాలి. అయినా ఇంత మంచి బుద్ధిమంతుడు దొరుకుతాడని గ్యారంటీ ఏమీలేదు. ఫలానా వెంకటాపురం జమీందారు ఒక హరిజనుడికి తన కూతుర్నిచ్చి పెళ్లిచేసాడు అంటే ఎంతగొప్పపేరు, పబ్లిసిటీ, ఇక్కడి పిచ్చి ప్రజలంతా నన్ను ఆకాశానికి ఎత్తేయరూ? వచ్చే ఎలక్షన్‌లో హరిజనులు గిరిజనుల బడుగువర్గాల ఓట్లన్నీ మనకేకదా?" అంటూ మళ్లీ నవ్వాడు

నా తల తిరిగిపోయింది. ఈ గొప్పవాళ్ల సమయస్ఫూర్తికి, తెలివితేటలకు హ్యాట్స్ ఆఫ్ అందుకే ఏ పార్టీ రూలింగ్‌కొచ్చినా పరిపాలించేది వీళ్లే! మిగతా ప్రజలంతా కేవలం పావులే!

శకుంతలకు శశిరేఖకు నేనంటే వల్లమాలిన అభిమానం. వాళ్లిద్దరిలో ఒకర్ని పెళ్లిచేసుకొని, రామ్మూర్తి మాస్టారు ఋణంగానీ రాజబాబుగారి ఋణంగానీ కొంతవరకు తీర్చుకోవాలనే కోరికుండేది. కానీ ఈ కులవ్యవస్థ పరుధుల్నిగానీ, సమాజపు కట్టుబాట్లుగానీ అధిగమించే తెంపు ధైర్యం వాళ్లకెక్కడిది? పోనీ నేనే చొరవ తీసుకొని సాహసం చేసుంటే— నన్నొక కృతఘ్నుడిగా నమ్మక ద్రోహిగా చిత్రించి ఉండేవారు.

"డాక్టర్‌గారు!" పిలిచి, గుడికెళ్లి తెచ్చిన ప్రసాదం నా చేతుల్లో పెట్టింది రాధ. ఆ కంఠంలో తియ్యదనంలో కొత్తదనం గోచరించింది.

తన్మయంతో తలెత్తిచూసాను— ఆమె మొహం మంచుతో కడిగిన ముత్యంలా ప్రకాశిస్తూ వుంది. ఆమెలో నాకు అష్టలక్ష్మి ప్రసన్నమైంది. రాధే నా ప్రాణం— సర్వస్వం. మా బంధం జన్మజన్మల అనుబంధం.

❖

## ఇల్లు



ఆ రోజే కమలమ్మ వాళ్ళ కొత్తయింటి గృహప్రవేశం.

"అబ్బ... యిల్లు బ్రహ్మాండంగా వుంది కమలమ్మ. అయినా మీ ఆయన 24 గంటలూ తాగి ఆస్తంతా కరిగించేశాడు మరి ఈ ఇల్లెలా కట్టారు" అడిగింది రమణమ్మ.

"ఖాళీ సీసాలన్నీ అమ్మి" తక్కున చెప్పింది కమలమ్మ.

కేశవేని గిరిధర్ (తెనాలి)